
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



జోగుళాంబ **గద్వాల** జిల్లా వార్తలు

శనివారం 4 అక్టోబరు 2025



దసరా ఉత్సవాల్లో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రావణాసుర వధ దృశ్యం

క్లిక్.. క్లిక్.



నింగిలో స్వర్ణ కాంతులు

సాయం సంధ్య వేళ.. అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలు మబ్బులతో కలిసి మెరిసి మురిశాయి. స్వర్ణ కాంతులతో నింగికి కొత్త అందాలను అద్దాయి. ప్రకృతి గీసిన వర్ణచిత్రం.. ఈ అద్భుత దృశ్యం.. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని బొంకూరు శివారులో కనిపించింది. 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మనిపించింది.

- అలంపూర్ చౌరస్తా (ఆంధ్రజ్యోతి)



మనుమడు రేయాన్ష్‌ను ఎత్తుకొని జమ్మికి వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వైభవంగా విజయదశమి

- కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దసరా వేడుకలు
- కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి శమీపూజ
- నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఘనంగా సంబురాలు
- ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, తూడి మేఘారెడ్డి

నాగర్‌కర్నూల్/ కొల్లాపూర్/ వనపర్తి రాజీవ్ చౌరస్తా, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో గురువారం విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో గ్రామాల్లో పట్టు సాధించేందుకు ఆశావాహులు, నాయకులు కూడా పల్లెలకు తరలి రావడంతో సందడి నెలకొంది. గురువారం గాంధీ జయంతి కారణంగా మద్యం, మాంసం దుకాణాలు మూసివేశారు. దీంతో చాలా మంది ముందు రోజే మద్యం, మాంసం కొనుగోలు చేశారు. దీంతో ఆయా దుకాణాల వద్ద జనం సందడి నెలకొన్నది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తమ స్వగ్రామం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో దసరా ఉత్సవాల్లో పాలుపంచుకున్నారు. గురువారం సాయంత్రం గ్రామానికి చేరుకున్న ఆయనకు అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆ తర్వాత జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 8 గంటల సమయంలో తన సొంత నియోజకవర్గం కొడంగల్‌కు బయల్దేరి వెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ట్యాంక్‌బండ్ వద్ద జమ్మి చెట్టుకు స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, సతీమణి కూచకుళ్ల సరితతో కలిసి పూజలు చేశారు. జనంతో కలిసి నృత్యం చేశారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఆయన స్వ గ్రామం తూడుకుర్తిలో గ్రామస్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో శమీ వృక్షం వద్ద పూజలు చేసి, హారతి ఇస్తున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



నాగర్‌కర్నూల్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి దంపతులు

● నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణం లోని వరిదేల వద్దనున్న శమీ వృక్షం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో దుర్గామాతను పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి పర్వదినం అందరి జీవితాల్లో వెలుగులు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని రాజావీధిలో శమీ వృక్షం వద్ద మంత్రి జూపల్లి ప్రత్యేక పూజలు చేశారు. వాసవి కన్యకా పరమే శ్వరి ఆలయంలో, అంబేడ్కర్ కాలనీ లో దుర్గామాతను దర్శించుకున్నారు.

● అచ్చంపేటలో నిర్వహించిన దసరా వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. అమ్మవారికి, శమీ వృక్షానికి పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జములమ్మ ఆలయ సమీపంలోని రిజర్వాయర్‌లో నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా ముస్తాబు చేసిన పవర్‌బోటుపైకి తీసుకెళ్లారు. అనంతరం తెప్పోత్సవం నిర్వహించారు.

● వనపర్తి జిల్లా కేంద్రంలోని ట్యాంకు బండు వద్ద నిర్వహించిన విజయదశమి ఉత్సవాల్లో సంస్థానాధీశుల వారసుడు రాజా కృష్ణదేవరావు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన నివాసం నుంచి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి కాలినడకన జమ్మి చెట్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలతో కలిసి పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో రావణ దహన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.



వనపర్తి పట్టణంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న సంస్థానాధీశుల వారసుడు రాజా కృష్ణదేవరావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



అచ్చంపేట పట్టణంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

గాంధీజీ సేవలు మరువలేనివి



గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బంది

- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్
- మహాత్ముడికి ఘన నివాళి

వనపర్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్య మంలో గాంధీజీ సేవలు మరువలేనివని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలను విలువలను నిబద్ధతతో ఆచరించడం వల్ల గాంధీ కీర్తిప్రతిష్ఠలు విశ్వవ్యాప్తం అయ్యాయని కొనియాడారు. ఆయన ఎంచుకున్న శాంతి, అహింసా మార్గాలు యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఇచ్చే ఘన నివాళి అన్నారు. కార్యక్రమంలో సీఐ, కృష్ణయ్య, సీసీఎస్ ఎస్ఐ జయన్న, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, షీ టీమ్ ఎస్ఐ అజంద్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మగ్దుం బారీ, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 101 రకాల వంటకాలతో విందు



విందు భోజనం చేస్తున్న కొత్త దంపతులు లిఖిత్, సింధూ

కొత్తకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గోదావరి జిల్లాను తలపించే విధంగా కొత్త అల్లుడికి 101 రకాల వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేసిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోటలో గురువారం చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన సహన, సురేష్ దంపతుల కూతురు సింధూను గత నెలలో వరంగల్ పట్టణానికి చెందిన లిఖిత్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి అయిన తర్వాత మొదటి పండుగ విజయదశమికి అల్లుడు లిఖిత్ ఇంటికి వచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలోని గోదావరి జిల్లాల్లో అల్లుళ్లకు ఏర్పాటు చేసే విందు భోజనం మాదిరిగా అల్లుడిని గౌరవించాలని 101 రకాల పిండి వంటకాలతో విందు భోజనాన్ని భారీ అరిటాకులో వడ్డించారు. ఈ వంటకాలను చూచి అల్లుడు ఆశ్చర్యపోయారు. ఇదిలా ఉండగా లెక్కించిన అల్లుడికి 100 వంటకాలు మాత్రమే ఉండటంతో మీరు చెప్పినట్లు 101 వంటకాలు లేవని తులం బంగారు కానుకగా ఇస్తేనే విందును ఆరగిస్తానని సరదాగా మొండికేశారు. బంధువుల సందడి మధ్య అల్లుడిని చిన్న చేయిద్దని బంగారం ఇస్తానని మామయ్య హామీ ఇవ్వడంతో అల్లుడు విందు భోజనాన్ని ఆరగించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి 7

జోగుళాంబ ఆలయంలో ప్రముఖుల పూజలు

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

- అలంపూర్‌లో కనుల పండువగా నదీహారతి, తెప్పోత్సవం 7



అలంపూర్ వద్ద తుంగభద్ర నదిలో కొనసాగుతున్న తెప్పోత్సవం

తూకాల్లో మోసాలకు అడ్డేది?



గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మూసి ఉన్న తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

6

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం కావాలి

- కర్ణాటక మాజీ డీజీపీ పుట్టపాగ రవీంద్రనాథ్

చికిత్స పొందుతూ బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- హాస్పిటల్ ముందు బాధిత కుటుంబ సభ్యుల ధర్నా



ఆసుపత్రి ముందు మృతదేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

కల్వకుర్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాన్పు అనంతరం ఓ బాలింత తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, డిండికి చెందిన గర్భిణి అంజనమ్మ (23) మూడవ సారి గర్భవతి అయ్యింది. కుటుంబ సభ్యులు ఆమెకు తొమ్మిది నెలలుగా కల్వకుర్తిలోని శ్రీరమ్య హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. ఈ నెల 6న కాన్పు కోసం ఆమెను భర్త ఆంజనేయులు అదే ఆసుపత్రికి తీసుకొచ్చాడు. వైద్యులు ఆమెకు సిజేరియన్ చేయగా, ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత రక్తం తక్కువగా ఉందని వైద్యురాలు చెప్పడంతో, నాగర్‌కర్నూల్ నుంచి రక్తాన్ని తీసుకొచ్చారు. ఆమెకు రక్తం ఎక్కిస్తుండగానే తీవ్ర అస్వస్థతకు గురయ్యింది. దీంతో వైద్యుల సూచన మేరకు ఆమెను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం అంజనమ్మ మృతి చెందింది. వైద్యానికి సుమారు రూ.28 లక్షలు ఖర్చు అయినట్లు భర్త తెలిపాడు. కాన్పు తేదీ ఈనెల 21న ఉండగా, ముందుగానే ఆపరేషన్ చేయడం వల్లే ఆమె మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు మృతదేహంతో ధర్నా చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి నచ్చచెప్పారు. చివరకు 7.30 గంటల సమయంలో బాధితులు ధర్నా విరమించారు. అయితే కొందరు మధ్యవర్తులు వారి మధ్య రాజీ కుదుర్చినట్లు సమాచారం.

అమ్మవారి ముక్కు పుడక రూ.6 లక్షలు

- వేలంలో దక్కించుకున్న సోదరులు



బొమ్మనపల్లిలో అమ్మవారి ముక్కుపుడకను దక్కించుకొన్న కుటుంబం

అచ్చంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన అమ్మవారికి అలంకరించిన ముక్కుపుడకను ముగ్గురు సోదరులు రికార్డు స్థాయిలో అత్యధిక మొత్తానికి దక్కించుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి బంగారు ముక్కు పుడకను శుక్రవారం వేలం వేశారు. గ్రామానికి చెందిన బిక్కుమాడ్ల లలితమ్మ, రంగయ్య కుమారులు రాజేశ్, నవీన్, అభిషేక్‌గుప్తాలు రూ.6,00,016కు వేలం పాడి ముక్కు పుడకను దక్కించుకున్నారు. గత ఏడాది పదర గ్రామంలో నిర్వహించిన అమ్మవారి ముక్కు పుడక వేలంలో బూరం సురేశ్ అనే వ్యక్తి రూ. 8,10,000కు దక్కించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో
వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

కొత్తకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానాయపల్లి, నిర్వేన్, పాలెం, కొత్తకోట గ్రామాల శివారులో వెంకటగిరి క్షేత్రంలో ఒకశిలపై భూదేవి, శ్రీదేవి సమేతంగా వెలిసిన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన కల్యాణ మండపంలో ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు సింగరా ఆచార్యులు మంత్రోచ్చరణల మధ్య మంగళసూత్రధారణ నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలతో భక్తులు గోవిందనామస్మరణ చేస్తూ... ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు శెట్టి, జగదీశ్వర్‌రెడ్డి, తిరుపతయ్య, భాస్కర్‌రెడ్డి, రాంబాబు, రాములు యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, రమేష్ బాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.జ

వెండి పతకం సాధించిన కానిస్టేబుల్ లింగన్న



వెండి పతకం, చెక్కుతో కానిస్టేబుల్ లింగన్న

మహబూబ్‌నగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతాన్ 2025లో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ లింగన్న వెండి పతకం సాధించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో గురువారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ఆధ్వర్యంలో 10కి.మీ. రేస్ నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న ఏఆర్ కానిస్టేబుల్ లింగన్న అద్భుత ప్రతిభతో వెండిపతకం తోపాటు రూ.10వేల నగదు పురస్కారం గెలుచుకున్నారు. జిల్లా పోలీసు రాష్ట్రమీట్‌లో పతకం సాధించినందుకు ఎస్పీ జానకి అభినందించారు. విధి నిర్వహణలోనే కాకుండా క్రీడలలో కూడా ప్రతిభ కనబరచడం గర్వకారణమన్నారు.

చిన్నయ్య కుంట చెరువు తూము ధ్వంసం

» వృథాగా వెళ్లిన సాగునీరు, చేపలు

ఖిల్లాఘణపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్కిమియాన్‌పల్లిలోని చిన్నయ్యకుంట చెరువు కుంట తూమును ధ్వంసం చేయడంతో చెరువులో నిల్వ చేసిన సాగునీరు, మత్స్యకారులు పెంచుతున్న చేపలు వృథాగా మారి కాల్వల ద్వారా బయటకు వెళ్లిపోయాయి. చెరువు కింది భాగంలో వరి పంటలు కోతకు రావడంతో ఇటీవల తరచుగా వర్షాలు కురవడంతో పొలాల్లో నీరు నిలిచి ఉంటే పంటను కోయడానికి కోత మిషన్ రాదనే ఉద్దేశంతో చిన్నయ్యకుంట చెరువులోని నీటిని బయటకు వదిలి వాగు పాలు చేశారని మత్స్యకారులు వాపోతున్నారు. నీటిని బయటకు వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు, మత్స్యకారులు వాపోతున్నారు. రెండు సంవత్సరాలుగా ఆయకట్టు రైతులకు, చెరువు లోపల ఉన్న రైతులకు వివాదాలు కొనసాగుతున్నాయని, పండుగకు వరుసగా రెండు రోజులు సెలవు రావడంతో ఉద్దేశపూర్వకంగా చెరువులోని సాగునీటిని బయటికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామూహిక వివాహాలకు రావాలని సీఎంకు ఆహ్వానం


ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి సామూహిక వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మునిసిపల్ కౌన్సిలర్ అప్ప శివ

అచ్చంపేట టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలో నవంబరు 16న మునిసిపల్ కౌన్సిలర్ అప్ప శివ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. నాగర్‌కర్నూలు జిల్లా పరిసరాల్లోని గ్రామాలు, దేవరకొండ నియోజకవర్గ పరిసర గ్రామాల్లోని ఆర్థిక స్తోమత లేని యువతీ యువకులకు ఉచిత వివాహాలు తన సొంత ఖర్చులతో జరిపిస్తున్నట్లు సీఎంకు అప్పశివ వివరించగా, సీఎం సంతోషాన్ని వ్యక్తం చేసి అభినందించారని ఎమ్మెల్యే చెప్పారు.

పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని వ్యక్తి మృతి

జడ్చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీ కొట్టడంతో మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన రవిశంకర్ (38) మృతి చెందాడు. మహబూబ్‌నగర్ రైల్వే ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీకేరెడ్డి కాలనీకి చెందిన రవిశంకర్ గురువారం జడ్చర్లలోని తన బంధువుల ఇంటికి పండుగ సందర్భంగా వచ్చాడు. అదేరోజు రాత్రి 8:30గంటలకు తిరిగి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు జడ్చర్ల రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. పట్టాలను దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఆయన మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తూకాల్లో మోసాలకు అడ్డేది?


ఓ దుకాణంలో ముందే కట్టిన సరుకులు


గద్వాలలోని ఓ దుకాణంలో అమ్మకానికి ఉంచిన మటన్

» ఫిర్యాదు చేసేందుకు ఎప్పుడు వెళ్లినా కార్యాలయం మూత
» గద్వాల జిల్లాకు తూనికలు, కొలతల అధికారి లేనట్లేనా?
» ఓ అధికారి పేరుతో ఆగని వసూళ్లు

గద్వాల క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలో తూకాల్లో మోసాలు, ఎమార్పీని మించి వస్తువుల విక్రయాలు చేస్తున్నారు. అయినా ఏ అధికారీ పట్టించుకోవడం లేదు. జిల్లాలో కొంతకాలంగా వ్యాపారులు ప్రజలను మోసం చేస్తున్నారు. కిరాణ దుకాణాలు, మటన్, చికెన్, పాల దుకాణాలు, పత్తి మిల్లులు, పెట్రోల్ బంక్‌ల్లో, చివరికి రేషన్ దుకాణాల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలోని కొన్ని కాలనీల్లో డీలర్లు, మండలాల డీలర్లు రేషన్ దుకాణాలకు ఇచ్చే ఎలక్ట్రానిక్ కాంటాలను సైతం వారికి తగ్గట్లు సిద్ధం చేసుకుంటున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఉన్న జిల్లా తూనికల కొలతల అధికారికి ఇలాంటి కొన్ని ఎలక్ట్రానిక్ కాంటాలు పట్టుబడ్డాయి.

అలాగే పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా జిల్లాలో పెట్రోల్ బంక్‌లను కూడా పెంచుతున్నారు. అయితే లీటర్ పెట్రోల్, డీజిల్‌కు సరిపడా డబ్బులు తీసుకుంటున్నారే కానీ, సరిపడా పెట్రోల్, డీజిల్ పోయడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కసారి ఎవరైనా వాహనదారులు పెట్రోల్‌ను బైక్‌లలో కాకుండా ఖాళీ బాటిల్‌లో పోసుకుంటే విషయం ఇట్టే అర్థమైపోతుంది. కానీ ఇలా వాహనాదారులు ఖాళీ బాటిల్‌లో పోసేందుకు ఇష్టపడరు. ఇలా కొందరు ఖాళీ బాటిల్‌లో పెట్రోల్ పోసుకొని తక్కువ రావడంతో గతంలో పెట్రోల్ బంకుల యజమానులతో గొడవ పడ్డ సంఘటనలు కూడా చాలా ఉన్నాయి. అలాగే జిల్లాలో దుకాణాదారులు విచ్చలవిడిగా అధికరేట్లతో సరుకులు అమ్ముకుంటున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని బాధితులు వాపోతున్నారు. గద్వాలలో మటన్, చికెన్ రేట్లను ఒక్కోచోట ఒక్కోవిధంగా అమ్మడంలో ఆంతర్యం ఏమిటో తెలియడం లేదు. గద్వాలలోనే కొన్ని చోట్ల మటన్ కిలో రూ.800 ఉంటే మరికొన్ని చోట్ల రూ.900కు విక్రయిస్తున్నారు. కాగా కిలోకు 100 నుంచి 200 గ్రాములు తక్కువ ఇస్తున్నారు.

జిల్లాలో కనిపించని అధికారులు

జిల్లాలో ఇలాంటి తూనికలు, కొలతల్లో మోసాలు నివారించే అధికారి ఎక్కడా కనపడక పోవడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. సంబంధిత అధికారి కార్యాలయం ఎప్పుడూ మూసి ఉంటుందే తప్పా, తెరుచుకున్న దాఖలాలు లేవు. జిల్లా ఇన్‌చార్జి అధికారిగా ఉన్న రహీందర్‌బాబు కేవలం గద్వాల జిల్లాకే కాకుండా మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాలకు కూడా ఇన్‌చార్జి కావడంతో ఆయన ఎప్పుడు వస్తారో తెలియడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా కార్యాలయం మూసి ఉంటున్నది.

అధికారుల పేరుతో వసూళ్లు?

అధికారులు లేకపోవడమా.. లేక అధికారుల అండదండలతో ఏమో కానీ గద్వాల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తూనికలు, కొలతల దుకాణంలో సిబ్బందిమి అంటూ చెప్పుకోవడమే కాకుండా, వ్యాపారస్థుల నుంచి నెల నెలా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు తెలిసి జరుగుతున్నదా... తెలియకుండా జరుగుతున్నదా అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయంపై సంబంధిత అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అంత్యక్రియలకు హాజరైన ప్రముఖులు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి మాతృవియోగమైంది. రెండు రోజుల క్రితం మృతి చెందిన ఆయన మాతృమూర్తి లక్ష్మమ్మ (90) అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వగ్రామం తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో జరిగాయి.

ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డిలు ఆ గ్రామానికి చేరుకొని లక్ష్మారెడ్డి తల్లి మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.


మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తల్లి అంత్యక్రియలకు హాజరైన మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

యువత మత్తుకు చిత్తు కావొద్దు

● శక్తి, యుక్తులే యువతకు ఆయుధాలు ● ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్

గద్వాల సర్కిల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శక్తి, యుక్తులే యువత ఆయుధాలని, అలాంటి యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుకు చిత్తు కావొద్దని టొబాకో కంట్రోల్ హీరో జాతీయ పురస్కార గ్రహీత, హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ సూచించారు. దసరా వేడుకల సందర్భంగా అలంపూర్ జోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్న ఆయన శుక్రవారం గద్వాలలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను గౌరవిస్తూ, సమాజాన్ని, తమ బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధనతో ముందుకు వెళ్లాలని తెలిపారు. పలురంగాల్లో రాణించే వారిని పొగుడుతూ చప్పట్లు కొట్టే మనం, ఆ రంగంలో తామెందుకు రాణించరాదన్న ఆలోచనతో ముందుకు సాగితే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. ప్రస్తుత కాలంలో యువత కొందరు తల్లిదండ్రుల మాటలను పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సిగరెట్, డ్రగ్స్ తదితర మత్తుకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సరైన మార్గంకాదని వివరించారు. తాత్కాలిక మానసిక తృప్తి కోసం వ్యసనాలకు బానిసైతే శాశ్వతంగా తమ జీవితం నాశనం అవుతుందన్న సత్యాన్ని యువత గ్రహించాలన్నారు. పోలీసు శాఖ, సంబంధిత అధికారులు తరచు పొగాకు, డ్రగ్స్ మత్తు పదార్థాల నియంత్రణపై విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.


ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్

గోపాల మిత్రలకు అందని వేతనాలు


పేట మండలం జిల్లాల్‌పూర్‌లో టీకా వేస్తున్న గోపాల మిత్ర


రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించి సమస్యలు పరిష్కరించాలని కోరిన గోపాల మిత్రలు

» ఆరు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు

నారాయణపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పశువులకు వైద్య సేవలు అందిస్తూ, రైతులకు అండగా నిలుస్తున్న గోపాల మిత్రలకు వేతనాలు అందడం లేదు. దీంతో ఆరు నెలలుగా వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. కుటుంబ పోషణ కూడా భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పశువులకు వైద్య సేవలు అందించేందుకు గోపాల మిత్రలను నియమించింది. అప్పట్లో వారికి ప్రతీనెల రూ.1200 వేతన ఇచ్చారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయంలో ఆ వేతనం రూ. 2 వేలకు పెరిగింది. ఆ తర్వాత కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 3,500 పెంచారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రూ. 3,500 నుంచి ఒకే సారి రూ. 8,500 వరకు పెంచారు. గత ఎన్నికల ముందు పీఆర్‌సీ అమలుతో ప్రస్తుతం వారికి ప్రతీ నెల రూ.11,050 వేతనం ట్రెజరీ ద్వారా అందుతోంది.

సక్రమంగా అందని వేతనాలు

సకాలంలో వేతనాలు అందక గోపాల మిత్రలు ఇబ్బంది పడుతున్నారు. వారికి గత ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 247 మంది గోపాల మిత్రలు పని చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో 40 మంది గోపాల మిత్రలు ఉన్నారు.

దాదాపు 25 సంవత్సరాలుగా విధుల్లో ఉన్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించి వేతనాలు పెంచాలని, ప్రతీ నెల జీతాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. టార్గెట్‌తో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా తెల్లజాతి పశువులు 74,567, నల్ల జాతి 38,936 ఉన్నాయి. గొర్రెలు 12,30,711, మేకలు 1,18,524 ఉన్నాయి. వాటన్నింటికీ అవసరమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వీరిపైనే ఉంది. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవలే పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం సమర్పించారు.

ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించాలి



గోపాల మిత్రలను ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించాలి. 25 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న మా సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలి. ప్రతీ నెల క్రమం తప్పకుండా వేతనాలు అందించాలి. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలి.

- మాషప్ప, గోపాల మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు, నారాయణపేట

బడుగు, బలహీన వర్గాల
అభ్యున్నతే లక్ష్యం కావాలి

» కర్ణాటక మాజీ డీజీపీ పుట్టపాగ రవీంద్రనాథ్


జాతీయ విద్యా సంఘం అధ్యక్షుడు ఎంఏ హఫీజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న పుట్టపాగ రవీంద్రనాథ్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఎంచుకోవాలని కర్ణాటక రాష్ట్ర విశ్రాంత డీజీపీ పుట్టపాగ రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. జాతీయ విద్యా సంఘంలో విద్యనభ్యసించి వివిధ స్థాయిల్లో ఉన్న వాళ్లంతా ఐక్యంగా ఏర్పడి బడుగుల అభ్యున్నతికి శ్రమించాలని ఆయన పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన దివంగత మహేంద్రనాథ్ అడుగు జాడల్లో నడుస్తున్న వారిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే అట్టడుగు వర్గాల్లో మార్పు సాధ్యమని మహేంద్రనాథ్ భావించే వారని, ఆయన ఆశయ సాధన కోసం పని చేస్తేనే ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. 1985లో ఉమ్మడి రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా ఉన్న పుట్టపాగ మహేంద్రనాథ్ చేసిన హాస్టళ్ల ఏర్పాటు ప్రక్రియనే నేటి గురుకుల పాఠశాలలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గుడిపల్లి నిరంజన్, పోలే రవికుమార్, నరేందర్, నరసింహ, భగవేణి నరసింహులు, సంకటి బాలరాజు పాల్గొన్నారు.

త్వరలోనే పాఠశాలకు ఫర్నీచర్

» సరస్వతీ విగ్రహావిష్కరణలో ఎస్‌వీఎస్ హాస్పిటల్స్ అధినేతలు


ఐతోల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌వీఎస్ హాస్పిటల్స్ అధినేతలు రాంరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, జంగిరెడ్డిలు

తాడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఐతోల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరి విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. ఎస్‌వీఎస్ హాస్పిటల్స్ అధినేతలు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, వెంకటరెడ్డి, జంగిరెడ్డిలు శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని దాదాపు రూ.30లక్షలకు పైగా ఖర్చు చేసి అధునాతన హంగులతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఈ క్రమంలోనే పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి దసరా పండుగ నాడు వారు ప్రారంభించారు. రానున్న మరికొద్ది రోజుల్లోనే పాఠశాలలో పూర్తిస్థాయిలో విద్యార్థుల అవసరాల నిమిత్తం ఫర్నీచర్‌ను ఏర్పాటు చేసి అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. మొత్తంగా శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కొత్త హంగులు పులుముకోవడంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేయడంతో పాటు బలరాం రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించడంతో ఎస్‌వీఎస్ అధినేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

» పది గేట్లు ఎత్తి 2.76 లక్షల క్యూసెక్కులు విడుదల

గద్వాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా ప్రాజెక్టులకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గుతోంది. శుక్రవారం 3.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా పది గేట్లను పది ఫీట్ల మేరకు ఎత్తి 2,76,160 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 65,784 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 210.03 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుకులు కూడా ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. నారాయణపూర్‌కు 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 17,600 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నది.

భీమా నదికి వరద కొనసాగుతూనే ఉన్నది. సన్నతి బ్యారేజికి 3.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తాన్ని జూరాలకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 2.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 15 గేట్ల ద్వారా 2.43 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,262 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల బ్యారేజీకి 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 13 వేల క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.

ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ నానమ్మ మృతి


యశోదమ్మ (ఫైల్)

తాడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని ఐతోల్ గ్రామానికి చెందిన ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ నాయనమ్మ యశోదమ్మ (96) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యం తో హైదరాబాద్‌లో మృతి చెందారు. నాగ్ అశ్విన్ కుటుంబ సభ్యులు చాలా మంది అమెరికా, ఇతర దేశాల్లో ఉన్నందున ఆమె అంత్యక్రియలు నిర్వ హించేందుకు కొంత సమయం పట్టనుందని సమాచారం. ఆదివారం యశోదమ్మ అంత్యక్రియ లు సొంత గ్రామమైన ఐతోల్‌లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గోవింద్ (ఫైల్)

గోపాల్‌పేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గడ్డి మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మున్ననూర్ గ్రామానికి చెందిన కావలి గోవింద్(34) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తీవ్రమవడంతో గత నెల 22న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు కుటుంబ సభ్యులుకు తెలియజేయడంతో వారు.. హైదరాబద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 2న గోవింద్ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నామని ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు


గాలింపు చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీం


వాగులో గల్లంతైన శేఖర్ (ఫైల్)

మదనాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సరళాసాగర్ వద్ద చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో చోటు చేసుకుంది. కొత్తకోటకు చెందిన శేఖర్ తన ఇద్దరు కుమారులు, తమ్ముడితో కలిసి శుక్రవారం సరళాసాగర్ వద్దకు చేపల వేటకు వెళ్లాడు. అప్పటికే సైఫన్లు రెండు తెరుచుకొని నీటిని దిగువకు విడుదల చేస్తున్నాయి. వరద ఉధృతిని గమనించని అతడు ముందుకు వెళ్లగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. పోలీసులు సమాచారం అందుకొని రెస్క్యూ టీంను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి


అనూష(ఫైల్)

నారాయణపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటకు చెందిన అనూష(22) అనే బాలింత హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఆమెకు పురిటి నొప్పులు రావడంతో భర్త అశోక్ అనూషను గత నెల సెప్టెంబరు 25న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బాబు బాగానే ఉన్నా తర్వాత వెంటనే ఆమెకు ఫిట్స్ రావడంతో పరిస్థితి విషమించింది. దీంతో మహబుబ్‌నగర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించినా ఫలితం లేకుండా పోయి ఆమె మృతి చెందింది.

అయిజకు చెందిన వ్యక్తి..


గోపాల్ (ఫైల్)

● అయిజ,(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన కుమ్మరి గోపాల్ (40) కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 28వ తేదీన పొలం పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమిస్తుండటంతో అక్కడి నుంచి కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తిమ్మాజిపేటలో..


హుసేని(ఫైల్)

తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన హుసేని(36)అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కొద్ది సేపట్లో తిరిగి వస్తానని బైకుపై వెళ్లిన వ్యక్తి గుమ్మకొండ శివారులో ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అటు నుంచి వెళ్తున్న వాహనదారులు ఇచ్చిన సమాచారం మేరకు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా, అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి చెన్నమ్మ, అలివేల ఇద్దరు భార్యలు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని వారు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

గండీడ్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో డబ్బులు అడిగితే ఇవ్వలేదని మనస్తాపంతో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గండీడ్ మండలంలోని జానంపల్లిలో చోటు చేసుకుంది. మహమ్మదాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్ముఅమరేందర్(23) తన వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం డబ్బులు అవసరం ఉందని ఇంట్లో అడిగాడు. డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగుతుండగా అతని తల్లి రాములమ్మ గమనించి డబ్బాను లాగేసింది. అప్పటికే అతను కొంత మందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని సమీపంలో గల ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం తాగి...

ఖిల్లాఘణపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో గురువారం మద్యం తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కురువ పూల శ్రీశైలం (61) దసరా పండుగ సందర్భంగా గురువారం మద్యం (ఆల్కాహాల్) తాగడంతో ఛాతిలో నొప్పి వచ్చి మృతి చెందాడు. మృతుడి భార్య పూల సత్యమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు శ్రీశైలం మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామ శివారులోని బాలాజీ రైస్ మిల్లులో కూలీ పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. దసరా పండుగ రోజు బయటకు వెళ్లి మద్యం తాగి ఇంటికి వచ్చి వాంతి చేసుకున్నాడు. ఛాతిలో నొప్పి వస్తుందని తెలుపడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్ నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పూల సత్యమ్మ తన భర్త మరణంపై ఎలాంటి అనుమానం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

మృతదేహం లభ్యం

రేవల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామ చెరువులో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లి గ్రామానికి చెందిన మధురాజు పర్వతాలు (41) అనే వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. పర్వతాలు, కవిత దంపతులు గుడిపల్లి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. సోమవారం రాత్రి ఇంట్లో ఉన్న పర్వతాలు మంగళవారం ఉదయం నుంచి కనిపించ లేదు. చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం భార్య ఫిర్యాదు చేసింది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో నాగపూర్ ఊర చెరువులో అటుగా వెళ్తున్న బాటసారులకు ఓ మృతదేహం కనిపించింది. సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పైకి తీశారు. మృతదేహం పర్వతాలుగా గుర్తించారు. పోస్టు మార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

కారు, తుఫాన్ ఢీకొని ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందిస్తున్న 108 సిబ్బంది

మన్ననూర్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మూలమలుపు ఘాట్ రోడ్డులో కారు, తుఫాన్ వాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. జడ్చర్లకు చెందిన కుటుంబ సభ్యులు శ్రీశైలం నుంచి జడ్చర్ల వైపు కారులో వెళుతుండగా, మన్ననూరుకు 5 కిలో మీటర్ల దూరంలోని మూలమలుపు ఘాట్ రోడ్డు వద్ద మన్ననూరు వైపు ఎదురుగా వస్తున్న తుఫాన్ వాహనం ఆకస్మికంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో దేవి శివాని రెండు కాళ్లు ఫ్యాక్చర్ అవ్వగా , కవిత , రవీంద్ర చారిలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందివ్వగా, ఈఎంటీ మల్లేష్, పైలట్ వెంకటేష్‌లు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు వైద్యం అందించి అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

» మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దుర్గామాతను వేడుకున్నారు. గురువారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన బోడ నరసింహ కుటుంబాన్ని, సంగినేనిపల్లిలో మృతి చెందిన వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. పేద పిల్లల చదువు కోసం స్వచ్ఛంద సంస్థల సహకారంతో సహాయం చేస్తానని తెలిపారు. మాజీ సర్పంచు మౌలాలి, కాంగ్రెస్ నాయకులు ఇంద్రకంటి వెంకటేష్, చెన్నారెడ్డి, రాంరెడ్డి, ధనుంజయుడు, భరత్‌కుమార్‌రెడ్డి, టైలర్ రాముడు, వెంకట్రాజయ్య, వెంకటేష్, మోహన్ ,భాస్కర్, విజయభాస్కర్‌రెడ్డిపాల్గొన్నారు.


సంగినేనిపల్లి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి జూపల్లి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

» మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

పెబ్బేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతీ కార్యకర్త సమరానికి సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలు నిత్యచైతన్యవంతులని, మన సేవాభావం, మన ప్రవర్తన, సమస్యలపైన పోరాడే స్ఫూర్తి పట్ల ప్రజలు మనల్ని ఆదరిస్తారన్నారు. ఎన్నికల్లో డబ్బులు ప్రధానం కాదని, ప్రజా సమస్యల పట్ల పోరాడే మనస్తత్వం ఉండాలని హితోపదేశం చేశారు. మీ అభిప్రాయాలను గౌరవించే బాధ్యత నాదని నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, ఉమ్మడి మండలాల అధ్యక్షులు రాములు యాదవ్, వెంకటస్వామి, దిలీప్ కుమార్‌రెడ్డి, కర్రెస్వామి, విశ్వరూపం, హరిశంకర్ నాయుడు, వెంకటేష్‌పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

» కనుల పండువగా నదీహారతి, తెప్పోత్సవం

అలంపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు ఉదయం శమీ పూజ చేసి ఉత్సవ మూర్తులను రథోత్సవంలో ఉంచి పుర వీధుల వెంట ఊరేగింపు చేశారు. అనంతరం మహా పూర్ణాహుతి, అవభృత స్నపనం చేసి తుంగభద్ర పుష్కర ఘాట్ నందు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామికి చక్రస్నానం జరిపించారు. స్వామి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ కమిటీ సభ్యులు, ఈవో దీప్తి రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజలు చేసి నదిలో చక్రస్నానం నిర్వహించారు.

నదీహారతి, తెప్పోత్సవం..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సాయంత్రం నదీ పుష్కర ఘాట్లో అశేష జనవాహిని మధ్య కన్నుల పండువగా నదీహారతి, తెప్పోత్సవం ఆలయ అధికారులు నిర్వహించారు.

నదీమతల్లికి హారతులు ఇచ్చి హంసవాహనంలో ఉత్సవ మూర్తులతో నదిలో విహారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విజయుడు, గద్వాల సంస్థాన వారసుడు కృష్ణ రాంభూపాల్ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ధ్వజావరోహణం నిర్వహించి ఉత్సవాలకు స్వస్తి పలికారు.


అలంపూరులో నదీ హారతి నిర్వహిస్తున్న అర్చకులు

తెప్పోత్సవంలో విహరించిన జములమ్మ

గద్వాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జములమ్మ ఆలయంలో దసరా వేడుకలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు గురువారం నిజరూప దర్శనంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించి అనంతరం శమీ పూజ నిర్వహించారు. మొదటిసారి జములమ్మ రిజర్వాయర్‌లో అమ్మవారు విహరించేందుకు ప్రత్యేకంగా పవర్‌బోట్‌ను సిద్ధం చేసి, దానిని పూలతో, విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించిన బోట్‌లోకి చేర్చారు. రిజర్వాయర్‌లో అమ్మవారు తెప్పోత్సవంలో విహరిస్తుండగా భక్తులు పెద్ద ఎత్తున తరించారు. ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈఓ పురేందర్‌కుమార్, డైరెక్టర్లు మంగలి వీరేష్, కొండపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


జములమ్మ రిజర్వాయర్‌లో అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

» పలువురికి గాయాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా, పలువురు గాయాలపాలయ్యారు. జడ్చర్లలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా, ఒకరు మృతి చెంది.. ముగ్గురు గాయపడ్డారు. ఖిల్లాఘణపురం మండలం షాపూర్‌లో చెట్టును కారు ఢీకొని యువకుడు మృతి చెందాడు. అదేవిధంగా, జడ్చర్ల మండలం గంగాపురం గ్రామ స్టేజీ వద్ద సీఎం కాన్వాయ్‌ని రిసీవ్ చేసుకునే క్రమంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వాహనాన్ని గంగాపురం వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. డీఎస్పీతో పాటు, డ్రైవర్, గన్‌మన్‌లకు గాయాలయ్యాయి.


రవియాదవ్ (ఫైల్)

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..

జడ్చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని నేతాజీచౌరస్తాలో చోటుచేసుకుంది. ఈ సంఘటనలో అక్కడికక్కడే జడ్చర్ల పట్టణానికి చెందిన రవియాదవ్(48) మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలు కాగా, అందులో ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నది. జడ్చర్ల పట్టణంలోని మినీస్టేడియంలో దసరా ఉత్సవాలలో పాల్గొని, బంధువులకు జమ్మి ఇవ్వడానికి తన ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అతడి బైకును చర్లపల్లి గ్రామానికి చెందిన శివయాదవ్, ప్రశాంత్‌యాదవ్, సందీప్‌యాదవ్‌లు ద్విచక్రవాహనంపై అతివేగంగా ఢీ కొట్టారని స్థానికులు తెలిపారు. స్పృహకోల్పోయిన రవియాదవ్‌ను చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. మరో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురిలో శివయాదవ్‌కు తీవ్ర గాయాలు కాగా, హైదరాబాద్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు షాద్‌నగర్‌లో చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన రవియాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్‌యాదవ్ సోదరుడు. సంఘటనపై అశోక్‌యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. కాగా, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆయనను పరామర్శించారు.

చెట్టును కారు ఢీకొని యువకుడు..

ఖిల్లాఘణపురం,(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గౌరారం తండాకు చెందిన ఇస్లావత్ సురేష్ (21) కారులో షాపూర్ గ్రామ శివారు ప్రాంతం బస్టాప్ సమీపంలో వేగంగా వచ్చి అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో సురేష్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నుజ్జు నుజ్జుగా మారిన కారును పోలీసులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. మృతుడి భార్య వివరాల మేరకు... గురువారం సాయంత్రం తన భర్త సురేష్ అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండాలో స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా షాపూర్ స్టేజీ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

తప్పిన ప్రాణాపాయం

అలంపూరుచౌరస్తా, (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళితే.. కర్నూలు నగరానికి చెందిన మురళి అనే వ్యక్తి కర్ణాటక నుంచి కర్నూలు వైపు వెళ్తుండగా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు.

దీంతో కారు ఎడమ భాగం పూర్తిగా దెబ్బతినగా గాయాలతో బయటపడ్డాడు. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని హైవే సిబ్బంది అన్నారు. గాయపడిన వ్యక్తిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు.


షాపూర్ స్టేజీ వద్ద ప్రమాదానికి గురై నుజ్జు నుజ్జుగా మారిన కారు


సురేష్(ఫైల్)

డీఎస్పీ వాహనాన్ని ఢీకొట్టిన లారీ

» డీఎస్పీతో సహా డ్రైవర్, గన్‌మన్‌లకు గాయాలు

» ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తులో ప్రమాదం


జడ్చర్ల మండలం గంగాపురం వద్ద లారీ ఢీకొన్న సంఘటనలో ధ్వంసమైన పోలీసు వాహనం

జడ్చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహిస్తున్న బందోబస్తులో ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం గ్రామ స్టేజీ వద్ద గురువారం చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా మీదుగా కొడంగల్‌కు వెళ్తున్న ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను రిసీవ్ చేసుకునేందుకు జడ్చర్ల నుంచి మిడ్జిల్ వైపు వెళ్తున్న మహబూబ్‌నగర్ డీఎస్పీ వాహనాన్ని గంగాపురం వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ముందుగా వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి డీఎస్పీ వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో డీఎస్పీ వెంకటేశ్వర్లుతో పాటు వాహనం డ్రైవర్ గౌతాపురం రంగారెడ్డి, గన్‌మన్ శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు. పోలీసు వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో పోలీసు వాహనంలోని ఎయిర్‌బెలూన్‌లు ఓపెన్ కావడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనలో పోలీసు వాహనం పూర్తిగా ధ్వంసం అయ్యింది. సంఘటన స్థలం నుంచి లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఈ సంఘటనపై డీఎస్పీ వాహనం డ్రైవర్ రంగారెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

డీఎస్పీని పరామర్శించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల మండలం గంగాపురం గ్రామ సమీపంలో పోలీసు వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో గాయపడిన మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లును జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డీఎస్పీని పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవాబ్‌పేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురం వదిలేసి వెళ్లిపోవడంతో ఆందోళన చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన బంధువులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో ఊరంచుతండాలో చోటుచేసుకుంది. మృతుడి మేనమామ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జనార్ధన్ శుక్రవారం తెలిపారు. తండాకు చెందిన దీపక్ (36)కు గత 18 సంవత్సరాల క్రితం ఫరూఖ్ నగర్ మండలం చించోడ్‌కు చెందిన సుజాతతో వివాహం జరిగింది.

అన్యోన్యంగా ఉన్న వీరు గత రెండు సంవత్సరాల క్రితం విడిపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న దీపక్ జీవితం పై విరక్తి చెంది శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 12 గంటల ప్రాంతంలో చనిపోయాడు.

జోగుళాంబ ఆలయంలో ప్రముఖుల పూజలు


జోగుళాంబ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న న్యాయాధికారి

అలంపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో గద్వాల ఎస్పీ శ్రీనివాస రావు, హైకోర్ట్ న్యాయాధికారి ప్రవీణ్ కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట సీఐ రవిబాబు, ఎస్ఐ వెంకటస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ కుటుంబ సభ్యులకు సాదర స్వాగతం పలుకుతున్న అర్చకులు

ప్రారంభమైన జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలోని ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో 2.464 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టగా ఇప్పటి వరకు 375.067 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఎగువ నుంచి అత్యధికంగా వరద వస్తున్న కారణంగా దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో గత వారం రోజుల నుంచి విద్యుత్‌ను నిలిపివేశామని తెలిపారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎగువ నుంచి అత్యధికంగా వరద వస్తున్న కారణంగా దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో గత వారం రోజుల నుంచి విద్యుత్‌ను నిలిపివేశామని తెలిపారు.

ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 370.862 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. వరద ఉధృతి తగ్గితే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

చంద్రబాబు కుటుంబం పేరిట ఏటా పూజలు

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు


ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులతో బక్కని నర్సింహులు

అయిజ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నాటి సీఎం చంద్రబాబునాయుడుతో ఉన్న రోజులు గుర్తుకు వస్తున్నాయని' టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. 2012 సంవత్సరం నుంచి నేటి దసరా వరకు ప్రతీ దసరాకు అయిజకు వచ్చి చంద్రబాబునాయుడి కుటుంబ సభ్యుల పేరు మీద ఆయన ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగా గురువారం అయిజకు వచ్చి ఆలయంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2012 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా హిందూపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. దసరా నాటికి అయిజ చేరుకుని ఇక్కడే పండుగ జరుపుకున్నారని తెలిపారు. పక్కనే ఉన్న స్వయంభు కట్ట కింద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారని తెలిపారు. యువ నేత లోకేశ్‌తో కలిసి శమీ పూజలో పాల్గొన్నట్లు గుర్తు చేశారు. అక్టోబరు 2న పాదయాత్ర చేసి 22న దసరా రోజుకు అయిజ చేరుకున్నారని తెలిపారు. ఈ రోజు అక్టోబరు 2 గాంధీ జయంతి, దసరా రెండు ఒకే రోజు రావటం విశేషమని గుర్తు చేశారు. ప్రత్యేక ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత చంద్రబాబునాయుడు ఇక్కడ కల్యాణ మంటపం అభివృద్ధికి రూ. 35 లక్షలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న మంటపం నిర్మాణాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు సుధాకర్‌గౌడు, గోవిందు, గద్వాల ఇన్‌చార్జి జి.రాములు పాల్గొన్నారు.

బావిలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

మల్దకల్(గద్వాల), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామంలో పండుగ రోజు విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పూజారి హనుమంతు(42) అనే వ్యక్తి మద్యం తాగాడు. మధ్యాహ్నం సమయంలో మత్తులో తూలుతూ ఈత కొట్టేందుకు సమీపంలోని రాజావారి బావిలోకి ఈతకు దిగాడు. ఈత కొడుతూ ఆయాసం ఎక్కువై ఊపిరి ఆడక మృతి చెందినట్లు ఎస్ఐ నందీకర్ తెలిపారు. భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

జోగుళాంబ ఆలయ ధర్మకర్తలకు వీడ్కోలు



జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పాలక మండలి సభ్యులు

అలంపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐదవ శక్తి పీఠం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి పదవీ కాలం శుక్రవారంతో ముగియడంతో వారిని ఆలయ ఈవో దీప్తిరెడ్డి ఘనంగా సన్మానించారు. 04-10-2024 నుంచి 03-10-2025 వరకు సేవలు అందించిన చైర్మన్‌తో పాటు సభ్యులకు దేవస్థాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా పూల మాలలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు



మాట్లాడుతున్న రాంబాబు

ఇటిక్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి, అభ్యర్థులను గెలిపించుకోవాలని బహుజన సమాజ్‌పార్టీ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆకెపోగు రాంబాబు అన్నారు. శుక్రవారం ఇటిక్యాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, సర్పంచు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను నిలపాలని, అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్,శివ శంకర్‌యాదవ్, రామకృష్ణ, చిన్నరాముడు, శివన్న పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశ భద్రత

- జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అశోక్



మునిసిపల్ కార్మికులకు కొత్త దుస్తులు అందజేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు

అయిజ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని మోదీతోనే దేశ భద్రత, ప్రజా సంక్షేమం సాధ్యం అయ్యిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ జలగరి అశోక్ అన్నారు. నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ పిలుపు మేరకు సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా కార్యక్రమాలు కొనసాగించారు. అందులో భాగంగా 2న అయిజ మునిసిపాలిటీ కార్మికులను సన్మానించి కొత్త దుస్తులు అందజేశారు.

బీజేపీలో చేరికలు



కోండేరులో బీజేపీలో చేరిన యువకులతో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

ఎర్రవల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లి మండలంలోని కోండేరులో శుక్రవారం బీజేపీ పార్టీలో పలువురు యువకులు చేరారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులుగా మారి యువత బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రం అన్ని వస్తువులపై జీఎస్టీ భారం తగ్గించిందని గుర్తు చేశారు. కోండేరులో 50మంది యువకులు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగదీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కెకె రెడ్డితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాలఅర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏబీ స్విచ్‌లు మార్చడం, చెట్ల తొలగింపు పనుల కారణంగా 11 కేవీ టౌన్-1 ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10.30నుంచి 12.30 గంటల వరకు శేరెల్లివీధి, రాజవీధి, రాజయ్యతోట, వేదనగర్, రాఘవేంద్ర కాలనీ, తెలుగుపేట, రాంనగర్, తేరుమైదానం, కుంటవీధి, వడ్లవీధి, చేపల మార్కెట్ ఏరియా, బీసీ కాలనీ, రాంనగర్ ప్రాంతాలతో పాటు 11కేవీ టౌన్-3 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు వాటర్ వర్క్స్ పరిధిలోకి వచ్చే భీమ్‌నగర్, రాజీవ్‌మార్గ్, నల్లకుంట, శ్రీనివాసకాలనీ, రెవెన్యూ కాలనీ, గంజిరోడ్డు, చింతలపేట, రైల్వేస్టేషన్ ఏరియా, పెద్ద అగ్రహారం, సాయికృప హాస్పిటల్, నదిఅగ్రహారం, ఎంకంపేట ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.



గద్వాల గుంటి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాలలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి శోభాయాత్ర



గద్వాల గుంటి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద సంస్థాన వారసుడు కృష్ణరాంభూపాల్‌కు స్వాగతం పలుకుతున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు

అంబరాన్నంటిన విజయ దశమి సంబురాలు

● ఇంటింటా ఉత్సాహంగా దసరా ఉత్సవాలు ● సాయంత్రం శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు ● గద్వాలలో చెన్నకేశవుడిని దర్శించుకున్న సంస్థానవారసుడు

గద్వాల టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజయ దశమి వేడుకలు అంబరాన్నంటాయి. శరన్నవరాత్రుల చివరి రోజు ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దసరా పండుగ ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపి కొత్త విజయాలను సాధించిపెట్టాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆకాంక్షించారు. గద్వాల పట్టణంలోని తేరు మైదానం సమీపంలో గల చారిత్రక గుంటి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద గల పురాతన శమీ వృక్షానికి వేలసంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించి, ప్రదక్షిణలు చేశారు. శమీ శమయతే పాపం... శమీ శత్రువినాశిని.. అర్జునస్య ధనుర్ధారి... రామస్య ప్రియదర్శిని అనే మంత్రాలు ఆలయ పరిసరాల్లో మారుమోగాయి. ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జ్యోతి దంపతులు ప్రత్యేక పూజల అనంతరం జమ్మిచెట్టుకు ప్రదక్షిణలు చేశారు. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని కాళికాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి శోభాయాత్రలు స్థానిక గుంటి చెన్నకేశవస్వామి ఆలయం వరకు నిర్వహించారు. స్థానిక కోటలోని భూలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని విజయదశమి సందర్భంగా సందర్శించిన సంస్థాన వారసుడు కృష్ణరాంభూపాల్ స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక గుంటి చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద పురాతన శమీ వృక్షానికి పూజలు చేశారు. తొలిసారి ఆలయానికి వచ్చిన సంస్థాన వారసుడికి గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, రిటైర్డ్ డీవైఎస్‌వో జితేందర్, మాజీ కౌన్సిలర్ బండల పాండు ఘన స్వాగతం పలికారు.

● స్వగ్రామంలో దశమి వేడుకలు

ఇటిక్యాల: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన గురువారం తన స్వగ్రామం ఇటిక్యాలలో దసరా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆమెను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే మండలంలోని గ్రామాల్లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



స్వగ్రామం ఇటిక్యాలకు వచ్చిన రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ సృజనను కలిసిన గ్రామస్థులు

● ఎర్రవల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుండే భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి అలాయ్‌బలాయ్ కార్యక్రమాలు చేపట్టారు. సాంప్రదాయంగా నూతన దుస్తులు ధరించి, పిండి వంటలను తయారు చేసి నైవేద్యం సమర్పించారు.

● అయిజ : అయిజలో దసరా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి, కాళికామాత, అంబభవాని ఆలయాల్లో ప్రతీరోజు ఒక ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తదుస్తులు ధరించి పిండి వంటకాలు ఆరగించారు. శమీ, ఆయుధ పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా అయిజ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయుధ పూజ చేశారు.



అయిజలో పోలీసు వాహనాలకు పూజలు చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

● ఘనంగా అమ్మవారి ఊరేగింపు

రాజోలి : రాజోలిలో కొలువుదీరిన అంబభవాని అమ్మవారి ఊరేగింపు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రధాన వీధుల గుండా అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

వైభవంగా పల్లకీ సేవ

● ఆంజనేయ స్వామికి దాసంగాలు సమర్పించిన భక్తులు



ఆలయం వద్ద స్వామివారి పల్లకీ సేవను ప్రారంభిస్తున్న ధర్మకర్త, అర్చకులు



జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న అర్చకుడు

ధరూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా సందర్భంగా మండల పరిధిలోని పెద్దచింత రేవుల గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్థానికులతో పాటు రాయచూర్, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో తలరి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని, దాసంగాలు సమర్పించారు.

ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉన్న జమ్మిచెట్టుకు అర్చకులు సంప్రదాయ రీతిలో పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఆలయం వద్ద స్వామివారికి పల్లకీ సేవను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గిరిరావు, ఈవో కవిత, ఆలయ ప్రధాన అర్చకుడు భీంసేన్ ఆచార్యులు, గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గద్వాల నియోజక వర్గంలోని గట్టు, కేటి. దొడ్డి మండల కేంద్రంలో మండలంలోని స్థాయిలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ... త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం జరుగుతుంది కాబట్టి గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ప్రతీ ఒక్కరికి అవకాశాలు వచ్చే విధంగా వారి గ్రామాల రిజర్వేషన్లు అనుకూలంగా స్థానిక నాయకత్వం బట్టి ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పనిచేసి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచుల అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం

గద్వాల సర్కిల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలంలోని కొత్తపల్లి, గుంటిపల్లి గ్రామాల్లో శుక్రవారం గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో శీతాకాల శిబిరం ప్రారంభమైంది. కొత్తపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, హరితహారం, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలను ప్రజలకు వివరించాలని తెలిపారు.

తుపతురాలలో తాగునీటికి అవస్థలు

అయిజ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపాలిటీ పరిధిలోని తుపతురాల గ్రామంలో పండగ రోజు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం తాగు నీటి సరఫరా చేసే పైపులకు వాల్వు పాడవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీని కారణంగా ప్రజలు నీటి కోసం పంట పొలాలు, కాలువలు, చెరువులు, చేతిపంపుల వైపు పరుగు తీశారు. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ సైదులును వివరణ కోరగా 3వ తేదీన గురువారం పనులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారని తెలిపారు.



తాగునీటి కోసం చేతిపంపు వద్ద గుమిగూడిన తుపతురాల ప్రజలు

జూరాల వద్ద సందర్శకుల సందడి

● ఎక్కడా కనిపించని హెచ్చరిక బోర్డులు

● నీటి ప్రవాహం అధికంగా ఉన్నచోట సెల్ఫీలు తీసుకుంటున్న యువకులు

ధరూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ధరూరు మండలం రేవులపల్లి వద్ద ఉన్న జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి లక్షలాది క్యూసెక్కుల నీరు విడుదల కావడంతో సుమారు 30 గేట్లు ఎత్తివేయడంతో పర్యాటకుల సందడి పెరిగింది. వరుగా సెలవులు పండగ సెలవులు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన సందర్శకులు ప్రాజెక్టును తిలకించేందుకు కుటుంబ సభ్యులతో భారీగా తరలివచ్చారు. ప్రాజెక్టు నుంచి చూసేందుకు పెద్దలు, యువకులు, చిన్నారులు ప్రాజెక్టు పైనుంచి కృష్ణమ్మ పరవళ్లను చూసి పులకించిపోయారు. అలాగే వారంతా ప్రాజెక్టు ప్రధాన రహదారిపై నుంచి సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. కాగా, మరికొందరు అత్యుత్సాహంతో నీటి ప్రవాహనం సమీపంలోకి వెళ్లి ప్రమాదకరంగా సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. అలాగే అక్కడే ఉన్న చేపల విందును ఆరగిం చేందుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. కాగా, జూరాల ప్రాజెక్టు భారీగా సందర్శకులు తరలిరాడంతో వారిని కట్టడి చేసేందుకు అధికారుల పర్యవేక్షణ కొరవడిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రాజెక్టు దిగువ నీటి ప్రవాహం అధికంగా ఉన్నచోట ప్రమాదకర రీతిలో విన్యాసాలు చేస్తూ ఫొటోలు దిగుతున్నారు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని చర్చించుకుంటున్నారు. మరోవైపు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపో వడం, సందర్శకుల కట్టడికి తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి జూరాల ప్రాజెక్టుకు వచ్చే ప్రయాణికులు, సందర్శకుల కట్టడికి రక్షణ బోర్డులు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకో వాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సందర్శకులు కోరుతున్నారు.

మూడు దశాబ్దాలుగా సామాజిక ఉద్యమాల్లో



ఉండవల్లిలో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

● కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

ఉండవల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా సామాజిక ఉద్యమాల ద్వారా కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో విశేష కృషి చేసిన ఘనత కేవీపీఎస్‌దేనని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వేంకటేశ్వర్లు అన్నారు. కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉండవల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్ కేవీపీఎస్ జెండాను ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాజు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1998 అకోబరు 2న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఏర్పాటైందని, సుదీర్ఘకాలంగా ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలుచేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్లతో పోరాటాలు చేసిన ఘనత కేవీపీఎస్ దేనన్నారు. జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రతీ దళితవాడకు రెండు ఎకరాల శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి చదువుతున్న దళిత నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు ప్రవీణ్, బాలరాజు, శ్రీను, జయకర్, సురేశ్ ఉన్నారు.

మహాత్ముడి ఆశయాలు కొనసాగిద్దాం

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

● ఘనంగా గాంధీ జయంతి



గద్వాల చింతపేటలో గాంధీవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శాంతియుత సహజీవనం, దేశ సమగ్రత, సమైక్యతలే లక్ష్యంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని చింతపేటలో గల దివంగత బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్లు, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, సాయిశ్యామ్ రెడ్డి, నరహరి శ్రీనివాసులు ఉన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో..

గద్వాల క్రైం : జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ 156వ జయంతి, స్వాతంత్ర్య సమరయోధుడు భారత రెండో ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి 121వ జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు ఎస్పీ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతిపిత మహాత్మాగాంధీ తన సిద్ధాంతాలైన సత్యం, అహింసాతో దేనినైనా సాధించవచ్చు అని నమ్మిన వ్యక్తి అని, సత్యాన్ని, అహింసను పాటించడంలో ప్రపంచ మానవాళికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే లాల్ బహదూర్‌శాస్త్రి జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలచ్చి దేశానికి సైనికుల, రైతుల గొప్పతనాన్ని తెలియజేసిన వ్యక్తి అన్నారు. వారి ఆశయ సాధనకు ప్రతీ యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

● కలెక్టరేట్‌లో..

గద్వాల న్యూటౌన్ : స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ చూసిన అహింసా మార్గం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఏవో భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలలో వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.

● ఇటిక్యాలలో..

ఇటిక్యాల: గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం ఇటిక్యాలలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. ఎంపీడీవో అజార్‌మొహియుద్దీన్, కార్యదర్శి రమేశ్, గ్రామస్థులు డీలర్ యుగంధర్‌రెడ్డి, మాసన్న, రాముడు, అడ్వకేట్ యాకోబు,రాజు, ప్రభాకర్, రాముడు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● ఎర్రవల్లి : మండలంలోని కోదండాపురంలో గురువారం గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలిశ్రీనివాసులు, నాయకులు సోమనాద్రి, మధునాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లారెడ్డి, వెంకటేశ్‌యాదవ్, యువరాజ్ పాల్గొన్నారు.

● అయిజ : అయిజలో గాంధీజీ విగ్రహానికి పూ లమాలవేసి నివాళి అర్పించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఏబేలు, సర్వేశ్వరాచారి, నాగరాజు, లక్ష్మిరెడ్డి, బసన్న పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల పాలకవర్గం నాయకులు మధుసూదన్‌రెడ్డి, బాలవెంకట్‌రెడ్డి, కృష్ణ, తిమ్మప్ప, మహేందర్, వెంకటేశ్, మల్లికార్జున్, రమేశ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏవో, అధికారులు

అన్నిరంగాల అభివృద్ధే బీజేపీ లక్ష్యం



తనగలలో నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

వడ్డేపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశం, గ్రామంలో గ్రామీణప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, మహిళల ఆర్థికంగా శక్తివంతం చేయడంతో పాటు ఉపాధి కల్పన, అన్ని రంగాల్లో బీజేపీ ముందంజలో ఉందని పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం వడ్డేపల్లి మండల అధ్యక్షుడు బోయ నాగరాజు, పెద్ద నర్సింలు ఆధ్వర్యంలో తనగల గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు పార్టీలో చేశారు. మాజీ ఎంపీటీసీ నరేశ్, ముఖ్యనాయకులు రవిగౌడ్, రాజుగౌడ్, శంకరన్న గౌడ్, సిద్దయ్య గౌడ్, నరేంద్రలతో పాటు వంద మందికి పైగా నాయకులకు రామచంద్రారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడిన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ద్వారానే నాయకులు ఆకర్షితులై పార్టీకి చేరుతున్నారని అన్నారు.

తనగల గ్రామంలో నాయకుల చేరికతో పార్టీ మరింత బలపడిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్, సంజీవ రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు వెంకటేశ్వర్లు, అయిజ పట్టణ అధ్యక్షుడు భగత్ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ హరికృష్ణ, రంజిత్ పటేల్, మండల మాజీ అధ్యక్షుడు నరసింహులు, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, భీమన్న ఉన్నారు.